క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బలరాంనగర్‌కు చెందిన అనసూయ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం శుక్రవారం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో రూ.5000 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గౌడసంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, యాదయ్యగౌడ్, శివగౌడ్, మధు, శేఖర్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

నాగర్‌కర్నూల్: నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తానని జనసేన అభ్యర్థి వంగ లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేన తరుపున రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో వారాహి యాత్ర ఉంటుందని వివరాలు త్వరలో వెల్లడిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను మద్యానికి బానిసలు చేసిందని ఆరోపించారు.

సోనియాగాంధీకి రుణపడి ఉందాం

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి రుణపడి ఉందామని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కోడేరు మండలంలోని రాజాపూర్, మాచుపల్లి గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీశైలం డ్యాం కాంగ్రెస్ హయాంలో నిర్మించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

సాక్షి, నెట్‌వర్క్: వెల్దండ మండల కేంద్రానికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి, జోగయ్య, మధుసూదన్‌రెడ్డితోపాటు మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షంలో వెల్దండలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఐజాక్, ఉపసర్పంచ్ నిరంజన్, వెంకటయ్యముదిరాజ్, మల్లయ్యముదిరాజ్, దేవేందర్, యాదగిరి, శేఖర్, ఆనంద్, శివముదిరాజ్, బాల్‌రాజ్, కృపానందం, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి..

సాక్షి, నెట్‌వర్క్: వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో గాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కుర్మయ్యగౌడ్, జంగయ్య, శ్రీరాములుతోపాటు మరికొందరు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చేరారు. డాక్టర్ వంశీకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దర్గాలో ఎమ్మెల్సీ ప్రార్థనలు

తాడూరు: మండలంలోని పాపగల్‌లో శుక్రవారం నిర్వహించిన గ్యార్మీ ఉత్సవాలలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నిమతాలు సమానమేనని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. లింగం, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



కొల్లాపూర్: పట్టణంతో పాటు, పెద్దకొత్తపల్లి మండలంలోని యాపట్ల తండా, పెంట్లవెల్లి మండలంలోని ఎంగపల్లిలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు వివరాల ప్రకారం దాడుల్లో మొత్తం 34 లీటర్ల నాటుసారా, 13 వందల కేజీల నల్లబెల్లం, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 850 లీటర్ల బెల్లం ఊటను పారబోశామని తెలిపారు. ముగ్గురుపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. తనిఖీల్లో డీటీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

బెల్లం, సారా స్వాధీనం

పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి తండాలో ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు ఆదేశాల మేరకు ఎంగంపల్లి తండాలో శుక్రవారం ఎస్ఐ శంకర్ దాడులు నిర్వహించారు. 13 క్వింటాళ్ల బెల్లం, 34 లీటర్ల సారా, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన చంద్రనాయక్‌పై కేసు నమోదు చేసినట్లుగా ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని గుట్టమీది తండాకు చెందిన సబావత్ లక్ష్మి సారాను తరలిస్తూ శుక్రవారం పోలీసులకు పట్టుబడినట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు. ఆమె వద్ద నుంచి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రైతన్న దిగాలు



కోడేరులో ఈదురు గాలులకు నేలకొరిగిన వరిపైరు

కోడేరు: వారం రోజుల కిందట కురిసిన వర్షాలకు వరిపంట సాగు చేసిన రైతులను నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. చేతికి వచ్చిన పంటలు నేలవాలడంతో రైతన్న ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్లు గింజలు మొలక వస్తుందని భయంతో వరికోత చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు చేతికందే సమయంతో నష్టం వాటిల్లడంతో రైతన్న ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

తగ్గిన దిగుబడి

గతంలో ఎకరా పంట 35–45 క్వింటాళ్ల దిగుబడి రాగా వర్షాలతో చేతికి వచ్చిన పంట నేల రాలడం, చాలా చోట్ల ఈదురు గాలులతో నేలకొరగడంతో ఎకరాకు 25–30 క్వింటాళ్ల దిగుబడి తగ్గిందని అధికారులు పేర్కొన్నారు. వానాకాలంలో రైతులు 12500 ఎకరాలు సాగు చేశారు.

పంట నేలపాలైంది

మూడు రోజుల కిందట కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు చేతికి వచ్చిన పంట నేలపాలైంది. నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. సగం పంట నేలకొరిగింది. పంట దిగుబడి తగ్గడంతో పాటు నేలకొరిగిన పంట కోసేందుకు అదనంగా సమయం పడుతుంది. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.

–బాలస్వామి, రైతు, కోడేరు

త్వరలో కొనుగోలు కేంద్రాలు

త్వరలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. అకాల వర్షాలు కురిశాయని ప్రస్తుతం వరి కోతలు వాయిదా వేసుకోవాలి. కోత కోసిన వరిని రైతులు తడవకుండ జాగ్రత్తలు తీసుకోవాలి.

–శ్రీరాం, ఏఓ, కోడేరు

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



కొట్రలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వెల్దండ: మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని కొట్ర, రాచూర్, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నర్సరీల్లో సంచులలో మట్టిని వేసి విత్తనాలను నాటించాలన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా మొక్కలను పెంచాలన్నారు. ప్రతి గ్రామానికి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను రక్షించుకోవాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, టీఏ సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నయ్య, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

‘ఓట్లడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది’



సింగోటం ఆలయంలో పూజలు చేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: అభివృద్ధి పనులు చేశాం.. ప్రజలను ఓట్లడిగే హక్కు బీఆర్ఎస్ పార్టీకే ఉందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొల్లాపూర్‌లో మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 11:30 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఎంపీ రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కురువ విజయ్‌కుమార్, రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకటరెడ్డి, ధారాసింగ్‌లు ఉన్నారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వేలాదిగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తొమ్మిదిన్నరేళ్లు అధికారం దర్పం అనుభవించి, ఇక్కడ సీటు దొరకకపోవడంతో ఇంకో పార్టీలోకి పోయిన జూపల్లి కేసీఆర్‌ను విమర్శించడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ లేదా ఏదైనా పదవి ఇచ్చిఉంటే ఇక్కడే ఉండేవాడన్నారు. కాంగ్రెస్ నాయకులు కర్ణాటక మోడల్ అంటూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో వాగులపై వంతెనలు, పోడుభూములకు పట్టాలు, రహదారుల నిర్మాణాలు ఎన్నో చేపట్టామన్నారు. నేషనల్ హైవే, సోమశిల వంతెన సాధనలో తనతో పాటు ఎంపీ రాములు పాత్ర ఎంతో ఉందన్నారు.

మూడోసారి విజయ ఢంకా

ఎంపీ రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం, కొల్లాపూర్‌లో రెండోసారి హర్షవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుస్తారని జోస్యం చెప్పారు. హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు.

పెద్దకొత్తపల్లి/కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి పెద్దకార్పాముల గ్రామానికి చెందిన 80 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో చేరారు. బీఎస్పీ రాష్ట్ర నాయకుడు పసుపుల రామకృష్ణను ఎంపీ రాములు పార్టీలోకి ఆహ్వానించారు.

తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు

బిజినేపల్లి: తండ్రీకొడుకులను ఆర్టీసీ బైక్ ఢీకొని తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బిజినేపల్లి మండలం రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన తండ్రికొడుకులు బొగ్గు నర్సింహ, రామస్వామి బైక్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నామినేషన్‌లో భాగంగా నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొనేందుకు నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్నారు. వట్టెం సమీపంలో ఆర్టీసీ బస్సు వేగంగా వారి బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: వైద్యుల సూచనల మేరకు టీబీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందని పీహెచ్‌సీ సీహెచ్ఓ రామయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల, గోప్లాపూర్ గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్తుల అనుమానిత సర్వే నిర్వహించి టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు ఉన్న వారు తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోగం నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. క్షయ వ్యాధి (టీబీ) సోకిన వారు దగ్గినప్పుడు కానీ తుమ్మినప్పుడు గాలి ద్వారా ఎదుటివారికి వ్యాపిస్తుందని, అడ్డుగా చేతిరుమాలు పెట్టుకోవాలని కోరారు. అనుమానితుల నుంచి తెమడ సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోషమ్మ, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, నాగేశ్వరి, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. డ్రై డేలో భాగంగా మండల కేంద్రంతో పాటు రేమద్దుల, గోప్లాపూర్ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి పలు సూచనలు చేశారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తాయని, వారానికి ఒక్కసారి నిల్వనీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవాలన్నారు. కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. నిల్వ నీటిలో దోమల నివారణ కోసం అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



తెలకపల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల దొరల పాలనలో ప్రజలు విసుగుపోయారన్నారు. దళిత, బీసీ బంధు పేరులో ప్రజలను మోసం చేశారన్నారు. నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. అనంతరం మాజీ ఎంపీ బండ పర్వతాలు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. అంతకముందు మండలంలోని రాకొండలో గడపగడపకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, నాగర్‌కర్నూల్ వైస్ ఎంపీపీ నిర్మల, మాజీ ఎంపీపీ బండపర్వతాలు, గుగ్గిళ్ల ప్రకాష్, రాముడు, శ్రీనివాసులు, మల్లయ్య, రఘుకుమార్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలు మార్పు కోరుకుంటున్నారు’



పెంట్లవెల్లి: కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ మార్పిడి కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని జటప్రోల్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ నవీన్‌తో పాటు యువకులు, మహిళలు కొల్లాపూర్‌లో ఎల్లేని సమక్షంలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎల్లేని మాట్లాడుతూ కొల్లాపూర్‌లో 25 ఏళ్లుగా విర్రవీగుతున్న నాయకులకు ప్రజలు గుణపాఠ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి మృతి

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల గ్రామ సమీపంలో గొల్ల నర్సింహ(70)వృద్ధుడి మృతదేహం లభ్యం అయ్యింది. స్థానికుల వివరాల ప్రకారం చిన్నంబావి మండలం, బెక్కెం గ్రామానికి చెందిన గొల్ల నర్సింహకు మతిస్థిమితం లేదు. వారం రోజుల నుంచి గ్రామంలో తిరుగుతూ రోడ్లపైనే నిద్రిస్తున్నాడు. శుక్రవారం గ్రామ శివారులో అచేతస్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్తులు గమనించి మృతి చెందినట్లు గమనించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

బీజేపీ భారీ ర్యాలీ

కల్వకుర్తిరూరల్: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కొట్ర చౌరస్తాలో కేంద్రమంత్రి భగవంత్ బీజేపీ అభ్యర్థి ఆచారికి గజమాల వేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆచారిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యకర్తలు బహూకరించిన ఖడ్గాన్ని కేంద్రమంత్రి ప్రదర్శించారు.

నాయకుల ఫిర్యాదు

వంగూరు: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్ఐ కురుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సర్వారెడ్డిపల్లిలో గురువారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులను ఇష్టానుసారంగా ఎమ్మెల్యే దూషించాడని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సర్వారెడ్డిపల్లికి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన గువ్వల బాల్‌రాజ్‌ను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకున్నారని ఇందుకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

నాగర్‌కర్నూల్ క్రైం: నారాయణపేట జిల్లా చిన్న జక్లేర్ గ్రామానికి చెందిన మైనర్ మూగబాలిక ఇటీవల మన్నెంకొండ ఆలయానికి వచ్చి తప్పిపోయింది. తాడూరు మండలంలోని గుంతకోడూరు గ్రామంలో శుక్రవారం అనుమానస్పదంగా తిరుగుతోంది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో షీటీం బృందం గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ వద్దకు తీసుకొచ్చారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాలికను తల్లిదండ్రులకు ఎస్పీ అప్పగించారు. జిల్లా పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కరెంట్ బిల్లు రూ.83,760

కోడేరు: నవంబర్ నెలకు సంబంధించిన ఇంటి కరెంట్ బిల్లు ఏకంగా రూ.83,760లు వచ్చిందని కోడేరుకు చెందిన కురువ ఒగ్గు చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి కరెంట్ బిల్లు రూ.83,760లు చెల్లించాలని బిల్లు నంబర్ క్యూ18001148, బిల్లు తేదీ 04 నవంబర్ 2023 టీఎస్ఎస్‌పీడీసీఎల్ 109217329 ద్వారా చెల్లించాలని మెసెజ్ వచ్చిందన్నారు. దీంతో అవాక్కయిన వినియోగదారుడు ఒక నెల ఇంత బిల్లు రావడం ఏమిటని విద్యుత్ అధికారులకు తెలియజేశాడు. దీంతో స్పందించి ఆయన బిల్లు తప్పుగా వచ్చిందని సరిచేస్తామని ఏఈ ఓమేష్‌గౌడ్ వివరించారు.

ప్రజలకు అండగా ఉంటా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/తాడూరు: ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామం నుంచి వెలమ ఫంక్షన్‌హాల్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం వెలమ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీ హబ్ ఏర్పాటు చేస్తానన్నారు. ఈ ఎన్నికలు దొరకు, పేదబిడ్డకు జరుగుతున్న పోరాటం అని పేర్కొన్నారు. ఈనెల 19న నాగర్‌కర్నూల్‌కు సీఎం కేసీఆర్ వస్తున్నారని, నియోజకవర్గం నుంచి లక్ష మంది పాల్గొనేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తూడుకుర్తి దొరలను నమ్మొద్దని, దామోదర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు బాగుపడాలంటే కేసీఆర్ సీఎంగా ఉండాలని, ప్రతి రైతు పొలానికి నీళ్లు ఇచ్చే బాధ్యత మేము తీసుకుంటామన్నారు. తాడూరు మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్రిజనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ కార్యక్రమానికి అధికసంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్ రెడ్డి, నాయకులు నాగం శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం.. చిన్నారి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందిన చిన్నారి మృతిచెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిజినేపల్లి మండలం పోలేపల్లికి చెందిన లక్ష్మణ్ కుమారుడు మణికంఠ(2) దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుడిని సంప్రదించగా.. వైద్యుడు చిన్నారికి సూదిమందు చేసి జ్వరం తగ్గిపోతుందని ఇంటికి పంపించాడు. ఆ తర్వాత అర్ధరాత్రి మణికంఠకు జ్వరం ఎక్కువ కావడంతో జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మణికంఠ మృతికి ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు వేసిన సూదిమందే కారణమని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబసభ్యులు ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘటనకు సంబంధించి ఆస్పత్రి వైద్యుడు వెంకటరమణను వివరణ కోరగా.. జ్వరంతో వచ్చిన చిన్నారికి మెరుగైన చికిత్స అందించామని వైద్యుడి నిర్లక్ష్యం లేదని వెల్లడించారు.

రోల్ ప్లే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్రస్థాయి రోల్ ప్లే పోటీలలో నాగర్ కర్నూలు జిల్లా పెద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. మాదక ద్రవ్యాల వాడకం, నివారణ అనే అంశంపై ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ చాంద్ పాషాను ప్రశంసా పత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యం అందేనా?



అసంపూర్తిగా దర్శనమిస్తున్న మండల ప్రధాన పశువైద్య కేంద్రం

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో లక్షకు పైగా మూగజీవాలు ఉన్నా.. వాటి వైద్య వసతుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో సరైన సిబ్బంది అవసరమైన మందులను సమకూర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో మూగజీవాలకు వైద్యం అందక పాడి రైతులు, కాపరులు నానా అవస్థలు పడుతున్నారు. అసంపూర్తి భవనాల్లో చాలీ చాలని వసతులతో ఉన్న కొద్దిపాటి వైద్య సిబ్బంది కాలాన్ని వెల్లదీస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన వైద్య వసతులు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో..

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 1,05,411 మూగజీవాలు ఉన్నాయి. అందులో ఆవులు 5,570, గేదెలు 3,525, గొర్రెలు 85,291, మేకలు 4,303, పందులు 722, కుక్కలు 1,800, కోళ్లు 4,200 ఉన్నాయి. వీటికి అనుగుణంగా మండలంలో సరైన వైద్య సిబ్బంది లేకపోవడంతో జీవాలకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో రూ.వేలు ఖర్చు చేస్తూ ప్రైవేట్ మెడికల్ షాపులకు పరుగులు తీస్తున్నారు.

సరైన వైద్యాధికారులు లేక..

మండల కేంద్రంలో ప్రధాన పశువైద్య కేంద్రంతో పాటు కల్వరాల, వీపనగండ్ల, సంగినేనిపల్లి గ్రామాల్లో ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో వీపనగండ్ల, కల్వరాల గ్రామాల్లోని పశు వైద్యశాలలో ఏళ్ల తరబడి వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, రికార్డు అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నా వాటి నియామకంపై ఉన్నతాధికారులు దృష్టి సారించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కనీస వసతులు కరువు

సంగినేనిపల్లిలోని పశువైద్య ఉపకేంద్రం ఐదేళ్లుగా మూతపడి దర్శనమిస్తుంది. కల్వరాలలో వైద్యాధికారి లేకపోవడంతో అరకొర వసతులతో కార్యాలయం కొనసాగుతుంది. మండల కేంద్రంలోని ప్రధాన పశువైద్యాధికారి కార్యాలయం నిర్మాణం కోసం నిధులు లేక అర్థాంతరంగా భవన నిర్మాణం నిలిచిపోయింది. దీంతో ఒకే గదిలో మందులు, సిబ్బంది ఉంటూ కాలాన్ని వెల్లదీస్తున్నారు.

ఇబ్బందులు కలగకుండా..

మండలంలో సరైన పశువైద్య సిబ్బంది లేకున్నా రైతులకు, కాపరులకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాన్ని సకాలంలో చేరుకుంటూ నట్టల నివారణ మందులు, కృత్రిమ గర్భధారణ, వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తున్నాం. అవసరమైన చోట సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం.

– కె శ్యాం, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, వీపనగండ్ల